క్లుప్తంగా

బాధిత కుటుంబానికి గృహోపకరణాల సాయం



అందజేసిన గృహోకరణ సామగ్రితో దాతలు, బాధిత కుటుంబం

తాళ్లపూడి: ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోని పైడిమెట్ట గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ అనే సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయం అందించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో రూ.32,000 విలువైన గృహోపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఎంఈవో సీహెచ్ బాలమణి, వైఎస్సార్ సీపీ నాయకుడు యాళ్ల బాబూరావు, నందన ఫౌండేషన్ రవి, దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు ప్రత్తిపాటి అబెడ్నెగో, రాజు, సుధాకర్, భాను, పవన్, వెంకటేశ్వర్లు, బాబు, ప్రవీణ్, దినేష్ పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం



బ్లడ్ క్యాన్సర్ సోకిన విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఓ విద్యార్థికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. మండలంలోని ప్రక్కిలంకకు చెందిన దేవరపల్లి జోసెఫ్ అక్కడి పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. విషయం తెలిసిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆ విద్యార్థి వైద్య ఖర్చుల రూ.ఆరు వేలు అందించింది. ఈ మొత్తాన్ని ఆ సంస్థ మండలశాఖ అధ్యక్షుడు అంకం సురేష్ శనివారం ఆ బాలుడికి అందించారు. దీనికి అదనంగా ఇతర దాతలు మరో రూ. ఐదు వేల ఆర్థిక సాయాన్ని ఆ బాలుడికి అందించారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, గంధం మునేశ్వరరావు. కన్నెం సుబ్రహ్మణ్యం, ఎ.హనుమంతరావు, వాసుబోయిన చంద్రయ్య, చెరకు ఆంజనేయులు, పెమ్మాడి దుర్గా ప్రసాద్, దాసరి జయరార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడండి

నిడదవోలు రూరల్: ప్రతి వాహనదారుడూ హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని సమిశ్రగూడెం ఎస్సై రమేష్ సూచించారు. మండలంలోని డి.ముప్పవరం ప్రధాన సెంటర్‌లో శనివారం సాయంత్రం హెల్మెట్ ప్రాధాన్యతపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై చనిపోయే అవకాశం ఉందన్నారు. దీనివల్ల భార్య, పిల్లలు కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. అందుకే హెల్మెట్ వాడి తమ జీవిత కాలాన్ని పెంచుకోవాలని సూచించారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్సై పరమహంస, పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో వన మహోత్సవం

చాగల్లు: ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం చాగల్లులో వన మహోత్సవం నిర్వహించినట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మద్దిపాటి సురేష్ అన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తర తల్లి పేరున మొక్కను నాటి, సంరక్షించాలన్నారు. చాగల్లు గ్రామంలోని దేవాలయాలు, ఎంపీడీవో కార్యాలయం, పంచాయతీ కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి, ప్రభుత్వాసుపత్రి, ఆర్‌బీకే తదితర చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుటూరి జగన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గ్రంధి రాంబాబు, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

50 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు



రాంపాలెంలో పట్టుబడిన సారా, తయారీదారులతో పోలీసులు

గోపాలపురం: మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెంలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రంపై గోపాలపురం పోలీసులు దాడి చేశారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు జరిపిన ఈ దాడిలో ఘటనా స్థలంలో లభించిన 50 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీ కోసం సిద్ధం చేసిన సుమారు మూడు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. సారా తయారీతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్సై చెప్పారు.

వృథాగా సంపద తయారీ కేంద్రాలు

- 2016–17 సంవత్సరంలో నిర్మాణం
- ఒక్కొక్క కేంద్రానికి రూ. 8 లక్షల వ్యయం
- కొవ్వూరు డివిజన్‌లో 147 షెడ్ల నిర్మాణం
- తయారు కాని వర్మీ కంపోస్టు

దేవరపల్లి: కోట్లాది రూపాయల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. పేకాట స్థావరాలకు, మందుబాబులకు ఈ కేంద్రాలు నిలయాలుగా మారాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినప్పటికీ ఆచరణకు నోచుకోలేదని అంటున్నారు. 2016–17లో ఉపాధి హామీ పథకం నిధులతో కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. దీని నిమిత్తం ఒక్కొక్క కేంద్రానికి రూ.7 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకూ వ్యయం చేశారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రానికి తరలించడానికి స్వచ్ఛ సంకల్పం పేరుతో ఒక్కొక్క గ్రామ పంచాయతీకి 3 నుంచి 11 రిక్షాలను అందజేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. వాటిని రిక్షాల్లో సంపద తయారీ కేంద్రానికి తరలించి అక్కడ చెత్తను నిల్వ చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలి. ఆ వర్మీ కంపోస్టును ఉద్యానవ పంటలకు కిలో రూ.10 రేటుకు విక్రయించాలనేది ప్రభుత్వ ఆలోచన. ఈ విధంగా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు జమ చేయాలి. గ్రామాల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా ఎప్పటికప్పుడు నేరుగా ఇళ్ల నుంచి పంచాయతీ కార్మికులు కేంద్రాలకు తరలించాలి. ఈ పథకం మెట్ట ప్రాంతంలోని పూర్తిగా పడ కేసింది. నిర్మించిన షెడ్లు పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయి. చెత్తమాత్రం రోడ్లపైన, ఇళ్ల ముందు కుప్పలుగా పడి ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త సేకరణకు అందజేసిన రిక్షాలు కూడా తుప్పుపట్టి శిథిలమై పడి ఉన్నాయి. దీనికి కారణం గ్రామ పంచాయతీల్లో తగినంత మంది సిబ్బంది లేకపోవడం, ప్రభుత్వం ఇచ్చే వేతనం గిట్టుబాటు కాకపోవడమేనని అధికారులు అంటున్నారు. రిక్షా నడపడానికి సిబ్బంది రావడం లేదని పంచాయతీల అధికారులు చెబుతున్నారు.



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో ఎనిమిదేళ్లుగా వృథాగా ఉన్న సంపద తయారీ కేంద్రం



గ్రామాల్లో తుప్పుపట్టి ఉన్న చెత్త సేకరణ రిక్షాలు



దేవరపల్లి వీధుల్లోని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న కార్మికులు

147 సంపద తయారీ కేంద్రాల నిర్మాణం

కొవ్వూరు డివిజన్‌లో 153 గ్రామ పంచాయతీలు ఉండగా, 147 పంచాయతీల్లో 2016–17లో సంపద తయారీ కేంద్రాల షెడ్లు నిర్మించారు. సుమారు రూ.11 కోట్ల వ్యయంతో సంపద కేంద్రాల షెడ్లు నిర్మించారు. మెట్ట ప్రాంతంలో సంపద కేంద్రాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో సంపద కేంద్రాల నిర్వహణ జరుగుతుంది. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 80 గ్రామ పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్మాణం చేశారు. ఎక్కడా సంపద (వర్మీ కంపోస్టు) తయారు కావడం లేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి అన్ని కేంద్రాల్లో సంపద తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మండల, డివిజన్ స్థాయి అధికారులు సంపద కేంద్రాల నిర్వహణపై దృష్టి పెట్టారు.

వినియోగంలోని తీసుకువస్తాం



కొవ్వూరు డివిజన్‌లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్నాం. ప్రతి గ్రామంలో సంపద తయారీ కేంద్రాల నిర్మాణం జరిగింది. డివిజన్‌లో 147 కేంద్రల నిర్మాణం చేయగా, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో వినియోగంలో ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రం రూ. 7 నుంచి రూ. 8 లక్షల వ్యయంతో నిర్మించాం. అన్ని కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలకు ఆదేశాలు ఇచ్చాం. వీటిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు.

– అమ్మాజీ,
డివిజినల్ పంచాయతీ అధికారి, కొవ్వూరు

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం ఏడు గంటలకు మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొనసాగింది. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. దర్శనం చేసుకున్న భక్తులకు ప్రసాదంగా పులిహోర పంపిణీ చేస్తున్నామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ చెప్పారు. స్వామి అమ్మవార్లకు అలంకరణ, ప్రసాదం, అన్నదానం వంటి వాటి కోసం భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని తెలిపారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని చెప్పారు.

దేశం గర్వించదగిన నేత జగ్జీవన్‌రామ్



నిడదవోలు మండలం సింగవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెట్టే రాజు,దళితులు



నల్లజర్ల మండలం చీపురుగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు



తాళ్లపూడి సచివాలయం వద్ద మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

- డీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు
- పలుచోట్ల దళిత బాంధవుని వర్ధంతి

నిడదవోలు రూరల్: దేశం గర్వించదగిన నాయకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని దళిత వర్గాల ఫెడరేషన్ (డీవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు పేర్కొన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం మండలంలోని సింగవరం, సమిశ్రగూడెం, గోపవరం, రావిమెట్ల, కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాల్లో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమిశ్రగూడెంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి జరిగింది. కార్యక్రమాల్లో డీవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడి సుజ్ఞాన్ కుమార్, చెట్టే సుబ్బారావు, రమేష్, తాడేపల్లి విశాల్, అజయ్, కేవీపీఎస్ నాయకులు దిద్దే రాజు, ముప్పిడి జగ్జీవన్‌రామ్, సిర్రా గోపి, గెడ్డం మహేంద్ర, వరుణ్‌లు ఎమ్మార్పీఎస్, అరుంధతీసేవా సంఘం సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

చీపురుగూడెంలో..

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్ శిలా విగ్రహానికి ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జగ్జీవన్‌రామ్ పోరాట పటిమ, పరిపాలన దక్షతను వారు కొనియాడారు. కార్యక్రమంలో మోదుగ సుబ్బారావు, జాలాది రవి, వెంకటేశ్వరరావు, యర్రా జగదీష్, పండూరి చిన్నియ్య, కొక్కిరపాటి వెంకటేశ్వరరావు, మోదుగ నాగేశ్వరరావు, జాలాది చిన్ని తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం తాళ్లపూడి సచివాలయం వద్ద నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పంచాయతీ కార్యదర్శి సీహెచ్ ఆశా ఆలేఖ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, జూనియర్ అసిస్టెంట్ లీమా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అంజిబాబు, వెంకట్, ఏఎన్ఎం స్వర్ణలత, అగ్రికల్చర్ అసిస్టెంట్ రేవతి, మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే పైడిమెట్ట గ్రామ కూడలిలో పైడిమెట్ట జగ్జీవన్‌రామ్ సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొప్పాక కోటేశ్వర్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, జగ్జీవన్‌రామ్ సమాఖ్య అధ్యక్షుడు దేవరపల్లి రమేష్, కొల్లి దుర్గారావు, కొప్పాక ఆంటోని రాజు, కొప్పాక పోసియ్య తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణ మెరక వీధిలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్ సంఘం అధ్యక్షుడు పెనుమాక జయరాజు, గెల్లా గణేష్, చాపల చంద్రరావు, జి.జీవరత్నం, ముప్పిడి శ్రీను, ఎస్.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ఎమ్మార్పీఎస్, సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం దేవరపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి సురేష్ కుమార్ మాదిగ, సమత సైనిక్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మడతల శంకరంలు దళిత బాంధవుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు కోడిసూరి మాదిగ, సమత సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలుమాటి రామకృష్ణ, రాపాక అబ్బులు, తాతపూడి పుష్పానందం, అయినపర్తి హరిశ్చంద్ర ప్రసాద్, సిర్రా రాజు, చాపల శేఖర్ పాల్గొన్నారు.

8 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఉండ్రాజవరం: స్థానిక శ్రీసబిహ ట్రేడర్స్ రైస్‌మిల్లులో గుర్తించిన సుమారు ఎనిమిది టన్నుల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి సీజ్ చేసినట్లు పెరవలి, ఉండ్రాజవరం మండలాల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఎస్ సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ గఫార్ అలియాస్ బాషా అనే వ్యక్తి ఉండ్రాజవరంలో నడుపుతున్న ఈ రైస్‌మిల్లుపై దాడి చేయగా సుమారు రూ.3.70 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం లభించాయి. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పెరవలి దేవీ సత్య రైస్‌మిల్లులో భద్రపరుస్తున్నట్లు సుధీర్‌రెడ్డి చెప్పారు. ఈ దాడిలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు సీఎస్ డీటీలు జి.బాపిరాజు, ప్రభాకర్, అనిల్, ఉండ్రాజవరం వీఆర్వోలు వి.పాపారావు, ఆర్ఎన్‌వీ లక్ష్మి, బద్దా శ్రీనివాసు, వీఆర్ఏలు టి.శంకర్, జి.సుబ్బారావు పాల్గొన్నారు.



శ్రీసబిహ ట్రేడర్స్ రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

ముందు జాగ్రత్తలతో డయేరియా దూరం

నిడదవోలు: డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని స్థానిక నెహ్రూ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ.తేజశ్రీ సూచించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు శనివారం ఆమె డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. పిల్లల్లో అతిసార వ్యాధిని నియంత్రించేందుకు వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం హాస్టల్ పరిసరాలను, మరుగుదొడ్లను డాక్టర్ తేజశ్రీ పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. హెచ్‌వీ సత్యవతి, హాస్టల్ వార్డెన్ సీహెచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

జీవాల నుంచి మానవాళికి వ్యాధులు సోకకుండా..

- పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేస్తున్నాం
- పశుసంవర్ధక శాఖ ఏడీ మోజెష్ జాన్ వెస్లీ
- పలు ప్రాంతాల్లో జునోసిస్ దినోత్సవం



నల్లజర్ల పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ డాక్టర్ మోజెష్ జాన్ వెస్లీ

నల్లజర్ల: జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ నల్లజర్ల ఏడీ డాక్టరు మోజెష్ జాన్ వెస్లీ అన్నారు. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా నల్లజర్ల పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ముఖ్యంగా కుక్క కరవడం ద్వారా రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కుక్క కాటుకు గురైన వ్యక్తి నెలలో నిర్దేశిత ఐదు డోసుల వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఆంత్రాక్స్, క్షయ, మెదడు వాపు వంటి వ్యాధులు కూడా జంతువుల నుంచే మనుషులకు వ్యాప్తి చెందుతాయన్నారు. ఆసుపత్రిలో ప్రతి రోజూ కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్టు చెప్పారు.

పెరవలి మండలంలో..

పెరవలి: కుక్కల నుంచి వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించేందుకే కుక్కలకు వాక్సిన్ వేస్తున్నామని పశు వైద్యాధికారి డాక్టర్ సల్మా అన్నారు. శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని 160 పెంపుడు కుక్కలకు వాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కల నుంచి మనుషులకు రక్షణ కల్పించేందుకే ఈ వాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంల్లో ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా దమ్మెన్ను గ్రామంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పశువైద్యం అసిస్టెంట్ పి.అంజి పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీనివాసవర్మ, కార్యదర్శి వై.భార్గవీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక పశువుల ఆసుపత్రిలో నిర్వహించారు. లయన్ ఎన్‌టీ శ్రీనివాసరావు అందించిన రూ. 9 వేల ఆర్థిక సహకారంతో 200 కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రాధాకృష్ణ , క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు, కార్యదర్శి బేతిన రామన్, బండి రాంగోపాల్, గారపాటి ప్రసాద్, జీఎన్ఆర్‌కే ప్రసాద్, అల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెరవలి మండలం ఖండవల్లిలో పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి

చాగల్లు: జునోసిస్ దినోత్సవం సందర్భంగా చాగల్లు–నెలటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చాగల్లు ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో 82 పెంపుడు కుక్కలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు, టీకాలు అందజేశారు. పశుసంవర్ధక శాఖ కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ జి.రాధాకృష్ణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్‌లు బి.గిరీష్, ఎంఎం రాజేష్ , పశు వైద్య సిబ్బంది, చాగల్లు–నెలటూరు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పెంపుడు కుక్కలు, పిల్లులకు స్థానిక పశు వైద్యశాలలో శనివారం రేబిస్ రాకుండా వాక్సిన్ వేశారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునోసిస్ వ్యాధులు అంటారని కార్యక్రమంలో పాల్గొన పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎ.వెంకటరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు విధిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ సభ్యులు తోడ్పాటు అందించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, కార్యదర్శి నాళం వీర వెంకట శ్రీనివాస్, పరిమి హరిచరణ్, పెనుమాక జయరాజు, పాలెంపాటి చినబాబు చౌదరి, కొవ్వూరు ఏఎస్‌పి ఎస్‌వీఎస్ జ్యోతి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మెసర్స్ సీతారామ గ్రానైట్ మెటల్స్ , సర్వే నెంబర్ : 343 /2 లో విస్తీర్ణం : 1.40 హెక్టార్లలో దుద్దుకూరు గ్రామం, దేవరపల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా (పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా) ఆంధ్రప్రదేశ్ , పర్యావరణ అనుమతులు యొక్క ఆర్డర్ నెంబర్ : No: SEIAA/ AP/ MIN/ WG/ 4/2023/5015/81/242.12/242.06 తేదీ : 26.06.2024న ఆర్డినరీ ఎర్త్, రోడ్ మెటల్, బౌల్డర్స్ మరియు బలాస్ట్ కోసం అనుమతులు పొందియున్నారు. ఆ ప్రతులు పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (MoEF& CC) వెబ్సైటు నందు లభించును.

– మెసర్స్ సీతారామ గ్రానైట్ మెటల్స్

చినుకు పడిందంటే చీకటే

- ఏడు గ్రామాలకు తరచూ విద్యుత్తు కోతలు
- తీవ్ర అవస్థలు పడుతున్న వినియోగదారులు

పెరవలి: వర్షం పడితే చాలు మండలంలోని ఏడు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది. దాంతో అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, ఖండవల్లి, మల్లేశ్వరం, కడింపాడు, కొత్తపల్లి అగ్రహారం, నల్లాకులవారిపాలెం గ్రామాల విద్యుత్తు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మల్లేశ్వరం ఫీడర్‌పై పైన పేర్కొన్న ఏడు గ్రామాలతో పాటు ఇరగవరం మండలంలోని కె.కుముదవల్లి, కంద్రిక, తూర్పువిప్పరు గ్రామాలకు విద్యుత్తు సరఫరా అవుతుంది. వర్షాకాలం మొదలైనప్పటి నుంచీ ఈ గ్రామాలకు ఎప్పుడు కరెంటు సరఫరా ఉంటుందో, ఎప్పుడు అంతరాయం కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు లైన్ మరమ్మతులు లేనపుడు ట్రీ కటింగ్ అని, జంపర్ తెగిపోయిందని, యాక్సిడెంట్ వలన స్తంభం పడిపోయిందని ఇలా ఏదో ఒక కారణం చెప్పి సరఫరాను నిలిపివేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తీరా సరఫరా నిలిపివేసిన ట్రాన్స్‌కో సిబ్బంది, వారు చెప్పిన చెట్ల కొమ్మల తొలగింపు, దెబ్బతిన్న జంపర్‌కు మరమ్మతులు వంటి పనులు చేయడం లేదని విమర్శిస్తున్నారు. బలమైన గాలి వీచినా, భారీ వర్షం కురిసినా, కరెంట్ తీగలపై ఆకులు పడినా గంటల తరబడి సరఫరాను నిలిపి వేయడంతో రాత్రిపూట చీకట్లో మగ్గాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. కరెంట్ సరఫరా లేక ఒక్కోసారి గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. విద్యుత్తు సరఫరాకు ఒక గ్రామంలో ఏదైనా అవాంతరం ఏర్పడితో పది గ్రామాలకు సరఫరాను నిలిపి వేసి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని విద్యుత్తు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.



పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్

ఏబీ స్విచ్‌లు ఉన్నా నిరుపయోగమే

ప్రతి గ్రామ కూడలి వద్దా ట్రాన్స్‌కో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేసింది. ఏ గ్రామంలో సరఫరాకు అంతరాయం కలిగితే ఆ గ్రామంలో మాత్రమే మరమ్మతులు పూర్తయ్యే వరకూ సరఫరాను నిలిపివేసి, మిగిలిన గ్రామాలకు కరెంటు ఇచ్చే సౌలభ్యం ఈ స్విచ్‌ల వలన కలుగుతుంది. అయితే అధికారులు మాత్రం ఒక గ్రామంలో సమస్య తలెత్తితే మరమ్మతుల పేరుతో మిగిలిన గ్రామాలకు సరఫరాను నిలిపి వేసి అంధకారంలో ఉంచుతున్నారని వినియోగదారుల విమర్శ. విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తుంటే ఎవరూ ఫోన్ తీయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ 10 గ్రామాల్లోనూ విద్యుత్ వైర్లు బాగా కిందకు వేలాడుతు ఉంటాయి. దానికితోడు పలుచోట్ల విద్యుత్తు వైర్లకు, స్తంభాలకు తీగలు, ముళ్లపొదలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి.

సమస్య ఉన్నపుడు మాత్రమే సరఫరా నిలిపివేత

దీనిపై పెరవలి సబ్ స్టేషన్ ఏఈ డేవిడ్ నిశ్చల్‌ను 'సాక్షి' వివరణ కోరింది. గ్రామాల్లో కరెంట్ సరఫరాలో సమస్యలు ఉన్నపుడు మాత్రమే సరఫరాను నిలిపివేసి పనులు చేయిస్తున్నాయని బదులిచ్చారు. ఈ 10 గ్రామాల ప్రధాన లైన్ పంట పొలాల నుంచి వెళ్లడం వలన తరచూ అంతరాయాలు తలెత్తుతున్న మాట వాస్తవమే ఉని అంగీకరించారు. అందుకే ఎప్పటికప్పుడు సరి చేస్తున్నామని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com